అర్హులైన గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

- **భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**



భద్రాచలం, నవంబర్ 9 (ప్రజాజ్యోతి): మారుమూల ఆదివాసీ గ్రామాల్లో నివసిస్తున్న అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 10 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 8

వ్యతిరేకతతో మారిన డీపీఆర్ లెక్కలు!

2 లో..

- **రూ. 600 కోట్ల ప్రతిపాదిత 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ప్రాజెక్టులో మారిన లెక్క..**
- **1.6 శాతం నుంచి 1.2 శాతానికి తగ్గిన కన్సల్టెన్సీ రుసుము**
- **దీంతో సుమారు 2.40 కోట్ల రూపాయిలు ప్రజాధనం మిగులు..**
- **ముందస్తు చెల్లింపులకు బదులు.. పనులు పూర్తయ్యాకే నిధుల విడుదల?**
- **మొదటి నుంచీ వ్యతిరేకించిన స్వతంత్ర కార్పొరేటర్ దుర్గాప్రసాద్**
- **'ప్రజాజ్యోతి' కథనాలు, ప్రజల అభ్యంతరాలతో మారిన వ్యవహారం**
- **ఆన్‌లైన్ విధానంలో టెండర్లు.. 'మంగళం కన్సల్టెన్సీ'కి లభించిన అవకాశం**



కొత్తగూడెం కార్పొరేషన్‌కు ప్రతిపాదించిన రూ.600 కోట్ల 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ప్రాజెక్టు డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) వ్యవహారంలో చివరకు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అందులో ఆఫ్ లైన్ టెండర్ కన్సల్టెన్సీ రుసుమును 1.6 శాతంగా నిర్ణయించి ఒక సంస్థకు బాధ్యతలు అప్పగించేలా సాగిన ప్రక్రియపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.





● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి



ప్రతి ఒక్కరూ తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నేటి వనరులను బలోపేతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 9, (ప్రజాజ్యోతి) ఎల్ నినో ప్రభావం కారణంగా కొత్తగూడెం జిల్లాలో భవిష్యత్తులో వర్షాభావ, కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను జిల్లాలోని జలాశయాలు, చెరువులకు మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ నీటి నిల్వలను పెంచడం, భూగర్భ జలాలను రీఛార్జ్ చేయడం, సాగునీటి వనరులను

మిగతా 2 లో...

ఆపదలోనూ.. ఆడబిడ్డల పెళ్లిళ్లకూ ప్రభుత్వ భరోసా!

- **123 కుటుంబాలకు రూ.1.02 కోట్లకు పైగా ఆర్థిక సాయం..**
- **కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**
- **ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నాం: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**




దమ్మపేట, నవంబర్ 9 (ప్రజాజ్యోతి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక చేయూత అందించడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల భారం

మిగతా 2 లో...

ఘనంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

ప్రజలతో కలిసి బాణా సంచా కాల్చి సంబురాలు చేసిన ఎమ్మెల్యే



ఇల్లందు, నవంబర్ 9 (ప్రజాజ్యోతి) దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకోని ఇల్లందు పట్టణంలోని పదవ వార్డులో నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా పాల్గొని పట్టణ ప్రజలతో కలిసి దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనంతరం ప్రజలతో మమేకమై బాణా సంచా కాలుస్తూ పండుగ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ఆ భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఇందిరమ్మ రాజ్యంలో

మిగతా 2 లో...

అర్హులైన గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

(మొదటి పేజీ తరువాయి...)

మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎంతో నమ్మకంతో తమ సమస్యల పరిష్కారం కోసం దర్బార్‌కు వస్తున్నారని, వారి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర శాఖలకు సంబంధించిన వాటిని సంబంధిత అధికారులకు పంపించి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన దర్బార్‌లో భూ సమస్యలు, వ్యవసాయానికి విద్యుత్ సౌకర్యం, ఉపాధి, స్వయం ఉపాధి రుణాలు, గృహ వసతి, తాగునీరు, విద్య, వైద్యం, ఆర్థిక సహాయం తదితర అంశాలపై పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందాయి. వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులకు విడతల వారీగా ప్రభుత్వ ప్రయోజనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓలు డేవిడ్ రాజ్, వేణు, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

(మొదటి పేజీ తరువాయి...)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పేదల ప్రతి ఇంట్లో ఆనందం, అభివృద్ధి వెలుగులు నిండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెండ్యాల రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యతిరేకతతో మారిన డీపీఆర్ లెక్కలు!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, ప్రజాజ్యోతి :





కొత్తగూడెం కార్పొరేషన్‌కు ప్రతిపాదించిన రూ.600 కోట్ల 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ప్రాజెక్టు డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) వ్యవహారంలో చివరకు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. అందులో ఆఫ్‌లైన్ టెండర్ కన్సల్టెన్సీ రుసుమును 1.6 శాతంగా నిర్ణయించి ఒక సంస్థకు బాధ్యతలు అప్పగించేలా సాగిన ప్రక్రియపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై మొదటగా స్వతంత్ర కార్పొరేటర్ కంభంపాటి దుర్గాప్రసాద్ బలంగా లేవనెత్తిన ప్రశ్నలు, 'ప్రజాజ్యోతి' దినపత్రిక ప్రచురించిన వరుస కథనాలు, అలాగే పట్టణంలోని వివిధ వర్గాల నుంచి వచ్చిన విమర్శల నేపథ్యంలో పాత టెండర్‌ను రద్దు చేసి ఆన్‌లైన్ విధానంలో ఆమోదయోగ్యంగా కొత్త బిడ్లను ఆహ్వానించారు. ఈ ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియలో మూడు కన్సల్టెన్సీ సంస్థలు పోటీపడగా, అందులో 1.2 శాతం రుసుమును కోట్ చేసిన 'మంగళం కన్సల్టెన్సీ'కి డీపీఆర్ తయారీ అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. అయితే గతంలో నిర్ణయించిన 1.6 శాతం రుసుము ప్రకారమైతే రూ.600 కోట్ల ప్రాజెక్టుకు కన్సల్టెన్సీ ఫీజు రూ.9.60 కోట్లుగా ఉండేది. కానీ ప్రస్తుత 1.2 శాతం సవరణతో ఈ ఫీజు రూ.7.20 కోట్లకు తగ్గింది. దీనివల్ల కార్పొరేషన్‌కు ప్రాథమికంగానే దాదాపు రూ.2.40 కోట్ల మేర ఆదా కానుండడం విశేషం. ఇక దీనికితోడు గతంలో ప్రతిపాదించిన ముందస్తు చెల్లింపుల (అడ్వాన్స్ పేమెంట్) నిబంధనకు కూడా అధికారులు స్వస్తి పలికినట్లు సమాచారం. కొత్త విధానంలో డీపీఆర్ తయారీ పనులు పూర్తయి, ప్రాజెక్టుకు సంబంధించిన నిధులు అందుబాటులోకి వచ్చిన తర్వాతే కన్సల్టెన్సీ రుసుము చెల్లించేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల పని కాకుండానే ముందస్తుగా ప్రజాధనం విడుదల చేసే పరిస్థితి తప్పడంతో పాటు కార్పొరేషన్‌పై అనవసర ఆర్థిక భారం తగ్గే అవకాశం ఏర్పడింది. ఇక ఇదే సమయంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద గతంలో చర్చకు వచ్చిన బస్టాండ్ అభివృద్ధి, సెంట్రల్ లైబ్రరీ, విద్యుత్ బస్సుల కొనుగోలు వంటి కొన్ని అంశాలను తాజా ప్రణాళిక నుంచి తొలగించినట్లు ప్రచారం జరుగుతోంది. వాటి స్థానంలో ఏ పనులకు ప్రాధాన్యమిచ్చారో కార్పొరేషన్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రారంభంలో చాలామంది ప్రజాప్రతినిధులు ఆమోదం తెలిపినప్పటికీ, దుర్గాప్రసాద్ నిలదీత మరియు ప్రజాజ్యోతి కథనాల ఫలితంగా టెండర్ ప్రక్రియలో పారదర్శకత వచ్చి ప్రజాధనం ఆదా కావడంపై స్థానిక వర్గాల్లో సానుకూల చర్చ సాగుతోంది.

ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026-27 వ్యవసాయ సంవత్సరంలో ఎల్ నినో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా కొత్తగూడెం జిల్లాలోని కఠిన రాతి నేలల ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం, స్థానిక చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు అడుగంటడం వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు తాగునీటి అవసరాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను ప్రత్యామ్నాయ నీటి వనరుగా వినియోగించుకునేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం ఎంతగానో దోహదపడుతోందని వివరించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సుమారు 17,150 ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగిన వైరా జలాశయం నీటి మట్టం డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను మళ్లించి జలాశయాన్ని నింపేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ చర్యల ద్వారా వైరా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలకు తాగునీటి సరఫరాకు భరోసా కల్పించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవని పరిస్థితుల్లో కూడా గోదావరి జలాలను ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు వీలవుతోందని అన్నారు .ప్రజలకు తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, అందుకు అనుగుణంగా జలాశయాల్లో నీటి నిల్వలను కాపాడుకోవాలని, తాగునీటి అవసరాలకు సరిపడా నీటిని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి, ఎక్కడా సరఫరాలో అంతరాయం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా అశ్వాపురం మండలంలోని బి.జి.కొత్తూరు పంప్ హౌస్-1 వద్ద ఖరీఫ్ 2026 సీజన్‌లో మొత్తం 1,604 గంటల పాటు భారీ మోటార్లను నిర్వహించి గోదావరి నది నుంచి 9.088 టీఎంసీల నీటిని ప్రధాన కాలువలోకి ఎత్తిపోసినట్లు కలెక్టర్ వివరించారు. అదేవిధంగా వి.కె. రామవరం వద్ద పంప్ హౌస్-2, కమలాపురం వద్ద పంప్ హౌస్-3 ద్వారా కూడా నీటిని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. సంక్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు ఉన్న ప్రాంతాలకు సైతం గోదావరి జలాలను మళ్లించడం ద్వారా నీటి కొరతను అధిగమించేందుకు ఈ పంపింగ్ కార్యకలాపాలు దోహదపడుతున్నా యని అన్నారు .ఈ నీటి మళ్లింపు ద్వారా ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్, తల్లాడ తదితర మండలాల్లోని నీటి వనరులకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లోని చెరువులు, జలాశయాలను నింపడం ద్వారా తాగునీటి అవసరాలకు అదనపు భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు కూడా నీరు అందుబాటులోకి వ చ్చిందన్నారు.జిల్లాలో సీతారామ ఎత్తిపోతల పథకం ప్యాకేజీలు 4, 7, 8, 9 మరియు 18 ఎల్ రాజీవ్ కాలువ పరిధిలోని 20 మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో గోదావరి జలాలను నిల్వ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ చెరువుల్లో మొత్తం 1,058.65 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని నింపడం ద్వారా ప్రత్యక్షంగా 9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించినట్లు వివరించారు.ములకలపల్లి మండలంలోని ఏదుళ్లవాగు చెరువు, పెద్దయ్య చెరువు, శ్రీరాములు చెరువు, తుమ్మకుంట, ఊరచెరువు, ఏదుళ్ల చెరువుల్లో నీటిని నిల్వ చేసినట్లు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని వెంగళరావు సాగర్, పెద్దచెరువు, అన్నదైవం ప్రాజెక్టు, చంద్రుగొండ మండలంలోని మద్దుకూరు ప్రాజెక్టు, జంట్లకుంట, గంద్ర వీరయ్య కుంట, శనగకుంట, జూలూరుపాడు మండలంలోని మేడికుంట, ఎర్రవాగు ప్రాజెక్టు, శనగచెరువు, సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం ప్రాజెక్టు, తల్లాడ మండలంలోని సుబ్బమ్మ చెరువు, బ్రాహ్మణపల్లి చెరువు, ఓరచెరువుల్లో నీటి నిల్వలను పెంచినట్లు తెలిపారు .చెరువుల్లో నీటిని నిల్వ చేయడం వల్ల ఆయా గ్రామాల్లోని రైతులకు సాగునీటి భరోసా లభించడంతో పాటు పశువుల అవసరాలకు, స్థానిక నీటి వనరుల వినియోగానికి కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితుల్లో చెరువుల్లో నీటి నిల్వలు అందుబాటులో ఉండటం వల్ల వ్యవసాయానికి ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించవచ్చని తెలిపారు .చెరువుల్లో నీటి నిల్వలు పెరగడం వల్ల పరిసర ప్రాంతాల్లోని బావులు, బోరుబావుల్లో భూగర్భ జలమట్టాలు పెరిగేందుకు దోహదపడుతుందని వివరించారు. తద్వారా వ్యవసాయ అవసరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వనరుల లభ్యత మెరుగుపడుతుందని అన్నారు . నీటి వనరులను ప్రస్తుత అవసరాలకే కాకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాకాలంలో లభించే నీటిని గరిష్టంగా నిల్వ చేసుకోవడం, చెరువుల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడం, భూ గర్భ జలాల పెంపునకు అనువైన చర్యలు చేపట్టడం ద్వారా కరువు ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు.

సీతారామ ఎత్తిపోతల పథకంలోని రాజీవ్ కాలువ ద్వారా మళ్లించిన గోదావరి జలాలు ఖమ్మం జిల్లాలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ చివరి ఆయకట్టు ప్రాంతాలకు కూడా ప్రయోజనం చేకూర్చాయని కలెక్టర్ తెలిపారు. చివరి ఆయకట్టులో నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితులను నివారించేందుకు గోదావరి జలాలను వినియోగించినట్లు వివరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 123 చిన్న నీటిపారుదల చెరువుల్లో 3,967 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని నిల్వ చేయడం ద్వారా 11,965 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు వైరా ప్రాజెక్టు పరిధిలో సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించినట్లు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తాగునీటి భద్రతకు భరోసా కల్పించడంతో పాటు 20 చెరువుల్లో నీటి నిల్వలను పెంచడం, 9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించడం, భూగర్భ జలాలు పెంపునకు దోహదపడటం సాధ్యమైందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

ఆపదలోనూ.. ఆడబిడ్డల పెళ్లిళ్లకూ ప్రభుత్వ భరోసా!





(మొదటి పేజీ తరువాయి...)

తగ్గించేందుకు సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 123 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1,02,70,092 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వీరిలో 87 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద రూ.87,10,092, మరో 36 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.15.60 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. మహిళల సంక్షేమం కోసం ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా సంఘాలు కీలకమని, వాటిని బలోపేతం చేసేందుకు నియోజకవర్గంలోని గ్రామాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టామని, ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మరోవైపు మురసు తుఫాన్‌తో దెబ్బతిన్న నియోజకవర్గంలోని రహదారులు, చెరువులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. విపత్తు జరిగిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. కేవలం రెండు రోజుల్లోనే అవసరమైన నిధులు కేటాయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ), దమ్మపేట తహసీల్దార్ మద్దినేని మురళి, ఎంపీడీవో బి. రవీంద్రరెడ్డి, మండలపల్లి సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 9 , (ప్రజా జ్యోతి) బూర్గంపాడు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు,ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు,వైద్యసిబ్బంది హాజరు,అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, ఈ విషయంపై మెడికల్ అధికారిని ప్రశ్నించారు. గైనకాలజిస్ట్ రోజు విడిచి రోజు విధులకు హాజరవుతున్నారని మెడికల్ అధికారి తెలపడంతో,కలెక్టర్ వెంటనే డీసీహెచ్ఎస్ కు ఫోన్ చేసి గైనకాలజిస్ట్ ప్రతిరోజూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, మహిళా రోగులకు వైద్య సేవలందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.అనంతరం రక్త పరీక్షల కేంద్రాన్ని సందర్శించి, ప్రతిరోజూ నిర్వహిస్తున్న పరీక్షల సంఖ్య, అందుబాటులో ఉన్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం వైద్య సిబ్బంది బాధ్యత అని కలెక్టర్ అన్నారు ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి బాధ్యతాయుతంగా సేవలందించాలని,రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలు అందించాలని, అవసరమైన సందర్భాల్లో మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించడంలో ఎలాంటి జాప్యం చేయరాదని స్పష్టం చేశారు,.ఆసుపత్రి ఆవరణలో ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని, వార్డులు, మరుగుదొడ్లు,రోగులు వేచి ఉండే ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు.ఆసుపత్రి ప్రాంగణంలో విద్యుత్ మీటర్ వద్ద వైర్లు బయటకు వచ్చి ఉండటాన్ని గమనించిన కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించి వాటిని సరిచేయాలని, రోగులు, సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వంట మనిషితో మాట్లాడి రోగులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో మందుల లభ్యత, ఇతర సమస్యలపై వైద్యాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు నిరంతరం వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.అనంతరం ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్, ఇదే విధంగా పనులు కొనసాగితే భవన నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. తగినంత మంది కార్మికులను ఏర్పాటు చేసి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి భవన నిర్మాణాన్ని నిర్దీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యసదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, వైద్యులు, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ఈ నెల 12న బహిరంగ వేలం

- దుకాణాలు, ఇతర లైసెన్సు హక్కులకు వేలం..
- రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రథమ ధరావత్తు

భద్రాచలం, నవంబర్ 9 (ప్రజా జ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన వివిధ దుకాణాలు,ఇతర లైసెన్సు హక్కులకేటాయింపునకు ఈ నెల 12వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారు.దేవస్థానంలోని దుకాణాల వేలం వివరాలు ఇలా ఉన్నాయి. 12వ నంబరు దుకాణానికి రూ.10 వేలు, 6వ నంబరు దుకాణానికి రూ.20 వేలు, 9, 10వ నంబరు దుకాణాలకు రూ.20 వేలు, 7వ నంబరు దుకాణానికి రూ.20 వేలు, 13వ నంబరు దుకాణానికి రూ.20 వేలు, 8వ నంబరు దుకాణానికి రూ.20 వేలు ప్రథమ ధరావత్తుగా నిర్ణయించారు.భద్రాచలంలోని కలగర తాయారు కాటేజీ ఖాళీ స్థలానికి రూ.10 వేలు, పర్ణశాలలో కాఫీ,టీ,కూల్‌డ్రింక్స్ విక్రయ హక్కుకు రూ.లక్ష,దీపారాధన ఒడ్డు విక్రయ హక్కుకు రూ.లక్ష ప్రథమ ధరావత్తుగా నిర్ణయించారు.

చర్ల రోడ్డులో పోలీసుల వాహన తనిఖీలు



భద్రాచలం, నవంబర్ 9 (ప్రజాజ్యోతి): భద్రాచలం చర్ల రోడ్డులో సోమవారం ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాలతో పాటు ట్రాఫిక్ నిబంధనల అమలును పరిశీలించారు. వాహనాలపై పెండింగ్ లో ఉన్న చలానాలను గుర్తించి, వాటిని వెంటనే చెల్లించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

25 ఏళ్లుగా మురుగు కాలువలు లేని ఆదర్శ్ నగర్ కాలనీ

- చిన్నపాటి వర్షానికే నిలిచిపోతున్న వర్షపు నీరు
- వ్యాధుల భయంతో కాలనీవాసులు

భద్రాచలం, నవంబర్ 9 (ప్రజా జ్యోతి): భద్రాచలం ఆదర్శ్ నగర్ కాలనీలో సైడ్ కాలువలు నిర్మించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ భద్రాద్రి ఫిజికల్ హ్యాండీక్యాప్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మద్దెల లక్ష్మయ్య ఆధ్వర్యంలో సోమవారం గ్రామపంచాయతీ ప్రజావాణిలో ఈవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.కాలనీ ఏర్పడి 25 సంవత్సరాలు దాటినా ఇంతవరకు సైడ్ కాలువలు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షానికే నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వనీటితో దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. తక్షణమే గ్రామపంచాయతీ నిధుల ద్వారా అయినా కాలనీలో సైడ్ కాలువలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.వినతిపై స్పందించిన ఈవో శ్రీనివాస్ త్వరలోనే అధికారుల ద్వారా నివేదిక తెప్పించుకొని సైడ్ కాలువల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దబాబు, శ్రీనివాస్, బాలరాజు, సురేష్, సురేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఇండస్ట్రియల్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం

- నూతన చైర్మన్‌గా మల్లాడి వెంకట్రావు ఏకగ్రీవం



భద్రాచలం, నవంబర్ 9 (ప్రజా జ్యోతి): భద్రాచలం ఇండస్ట్రియల్ ఏరియా ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నూతన చైర్మన్‌గా మల్లాడి వెంకట్రావు (కొండా) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.గత 25 సంవత్సరాలుగా చైర్మన్‌గా సేవలందించిన వాతాడి దుర్గారావు తన ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా పదవికి స్వచ్ఛందంగా రాజీనామా ప్రకటించారు.దీంతో అసోసియేషన్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న మల్లాడి వెంకట్రావును సభ్యులందరి ఆమోదంతో నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సభ్యులు నూతన చైర్మన్‌కు అభినందనలు తెలియజేశారు. అసోసియేషన్ అభివృద్ధికి సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. 25 ఏళ్లపాటు చైర్మన్‌గా సేవలందించిన వాతాడి దుర్గారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుదగం శ్రీనివాసు, చింతిరాల రవికుమార్, ఉమా, కోటేష్, నరేష్, జీటీఆర్, 14వ వార్డు సభ్యులు ఇలమల అశోక్, కంచర్ల సరోజ నమ్మ, సంపత్, ఆనంద్, నరసింహ చారి , అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

స్వామివారి సేవలో భద్రాచలం ప్రముఖ వ్యాపారవేత్త

- కె. రామకృష్ణ, వనజ దంపతులు
- స్వామివారి అన్నదానానికి రూ.1,00,116 విరాళం

భద్రాచలం, నవంబర్ 9 (ప్రజా జ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత అన్నదాన కార్యక్రమానికి పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన కె. రామకృష్ణ, వనజ దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. దేవస్థానం అధికారులకు అన్నదాన నిమిత్తం రూ. 1,00,116 లు అందజేసి రసీదును స్వీకరించారు. దాతలను దేవస్థానం అధికారులు సత్కరించారు.

›» కార్తీక మాసంలో శివాలయంలో ప్రత్యేక పూజలు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ దామోదరరావు తెలిపారు.ఈ నెల 9న సాయంత్రం 6 గంటలకు ఆకాశదీపం ఏర్పాటు చేయనున్నారు. నవంబర్ 16, 23 తేదీల్లో కార్తీక సోమవార ప్రత్యేక అభిషేకాలు, 24న పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం, 29న ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణం, 30న ప్రత్యేక అభిషేకం, డిసెంబర్ 7న లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



కార్తీక మాస ఉత్సవాలకు
మల్లికార్జున స్వామి దేవస్థానం ముస్తాబు

- నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు
- నవంబర్ 24న కార్తీక పౌర్ణమి.. దీపోత్సవం, జ్వాలాతోరణం, గంగా హారతికి ఏర్పాట్లు
- డిసెంబర్ 7న స్వామి వారి కల్యాణం, అన్నదానం





అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 10, (ప్రజా జ్యోతి):

కార్తీక మాసం హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన మాసంగా ప్రసిద్ధి చెందింది. ఈ మాసంలో శివారాధన,దీపారాధన,ఉపవాసాలు,అభిషేకాలు చేయడం విశేష ఫలితాలను అందిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ముఖ్యంగా పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మాసంగా కార్తీక మాసాన్ని భావిస్తారు. తెల్లవారుజామున పవిత్ర స్నానాలు ఆచరించడం, శివాలయాలను దర్శించుకోవడం, దీపాలు వెలిగించడం,కార్తీక పురాణం పఠించడం ఈ మాసంలో విశేషప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ ఏడాది నవంబర్ 10వ తేదీ మంగళవారం మధ్యాహ్నం నుంచి డిసెంబర్ 8వ తేదీ మంగళవారం వరకు కార్తీక మాసం కొనసాగనుంది.ఈ నేపథ్యంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాస ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రతి సంవత్సరం నిర్వహించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గర్భగుడి శివలింగ ఆకారంలో ఉండి, అందులో 108 శివలింగాలు ఏర్పాటు చేయడం ఈ దేవస్థానానికి ప్రత్యేక విశిష్టతగా నిలుస్తోంది. ఈ అరుదైన నిర్మాణ ప్రత్యేకతతో ఆలయం జిల్లాలో ప్రముఖ శైవ పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందింది. కార్తీక మాసంలో ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు.



›» నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు

కార్తీక మాసంలో ప్రతి సోమవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడంతో పాటు భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం భక్తుల సమక్షంలో ఆకాశ దీపం వెలిగించనున్నారు.సాయంత్రం 6గంటలనుంచి మంత్రపుష్పం,కార్తీక పురాణ పఠనం కార్యక్రమాలు ప్రతి రోజూ కొనసాగనున్నాయి. నెల రోజుల పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.

›» ఏడాది పొడవునా అన్నదాన సేవ

ఈ దేవస్థానంలో మరో విశిష్టత ఏమిటంటే ఏడాది పొడవునా వచ్చే ప్రతి సోమవారం భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నప్రసాదాన్ని అందిస్తూ అన్నదాన సేవను కొనసాగిస్తున్నారు. భక్తుల సహకారంతో నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ అన్నదాన కార్యక్రమం ఆలయానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది.



›» కార్తీక పౌర్ణమికి ప్రత్యేక ఆకర్షణ

నవంబర్ 24వ తేదీ మంగళవారం కార్తీక పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం 8 గంటలకు చండీ హోమం నిర్వహించనున్నారు. అనంతరం దీపోత్సవం, జ్వాలాతోరణం, కోనేటి హారతి, గంగా హారతి వంటి విశేష కార్యక్రమాలు భక్తుల సమక్షంలో నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి. ఈ వేడుకలు జాతరను తలపించే రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

›» డిసెంబర్ 7న స్వామివారి కల్యాణం

డిసెంబర్ 7వ తేదీన మాస శివరాత్రి పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆరోజు స్వామివారి కల్యాణంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్నికూడా ఏర్పాటు చేయనున్నారు. కార్తీక మాసం ముగిసే వరకు జరిగే పూజా కార్యక్రమాల్లో ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, గోత్రనామాలు చదివించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.కార్తీక మాస ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయమేనేజర్ పాకాల వెంకటరమణ ఆలయ సిబ్బందితో కలిసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల రోజుల పాటు జరిగే ప్రత్యేక పూజలు, కార్తీక పౌర్ణమి వేడుకలు,స్వామివారి కల్యాణ మహోత్సవానికి భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టారు.

వనవాసి నిలయానికి బియ్యం వితరణ



చర్ల, నవంబర్ 09(ప్రజా జ్యోతి):దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వనవాసీ కళ్యాణ పరిషత్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ సూచించారు. హైదరాబాద్‌కు చెందిన పట్నాల జానకిరాం–మల్లీశ్వరి దంపతులు తమ కుమారుడు వంశీ ఫణీంద్ర–నవ్యశ్రీ, మనవడు విరాజ్ కార్తికేయతో కలిసి తమ కుటుంబ పెద్దలైన గరిక తాతయ్య, ఆయన సతీమణి గరిక సత్తెమ్మ జ్ఞాపకార్థం కొమరం భీం విద్యార్థి నిలయానికి అరక్వింటా బియ్యం అందజేశారు. అలాగే దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ రకాల వంటకాలు, స్వీట్లు,పండ్లతో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కోరం సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు దాతల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా క్రమశిక్షణతో చదువులో రాణించాలని అన్నారు. విద్యార్థుల చదువుపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉపాధ్యాయులతో చర్చించి నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని సూచించారు. అప్పుడే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు.హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ జానకిరాం–మల్లీశ్వరి దంపతులు ప్రతి సంవత్సరం ఇక్కడి విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. మారుమూల అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలనే లక్ష్యంతో ఈ వసతిగృహం పనిచేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఇతర వ్యాపకాలపై దృష్టి సారించకుండా చదువుపై ఏకాగ్రత పెట్టి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. విద్యతో ఎంతోమంది జీవితాలు మారాయని, అటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు బాగా చదివి సంస్థతోపాటు తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. దేశవ్యాప్తంగా గిరిజన విద్యార్థుల కోసం వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో 443 విద్యార్థి నిలయాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతోనే ఈ నిలయాలు కొనసాగుతున్నాయని పేర్కొంటూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు తోడ్పడుతున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిలయ కమిటీ ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి బాలికా నిలయ కార్యదర్శి బండా స్వరూపరాణి, లవన్ కుమార్ రెడ్డి, నిలయ ప్రముఖ్ సంతోష్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పాలన

♦ ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం జన్మదిన వేడుకలు



ఇల్లందు, నవంబర్ 9(ప్రజా జ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకోని ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబురాలు నిర్వహించారు.ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, క్షేత్ర స్థాయిలో పర్యటించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలతో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతుందని, ముఖ్యంగా పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం ప్రత్యేక సహకారం అందిస్తున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోళ్ల సూర్యం, మండల రాము, మున్సిపల్ కౌన్సిలర్లు కొర్లపాటి శివకిరణ్, జాఫర్, సైదమియా, హరిహర క్షేత్రం చైర్మన్ మంజుల, సొసైటీ డైరెక్టర్ కునుసోత్ రాము,సర్పంచులు వల్లాల మంగమ్మ, పాయం లలిత,మెచ్చా సాయమ్మ, ధనసరి ప్రవంతి, ఈసాల సురేష్, ఈసం బాలకృష్ణ, బోడా కిషోర్, మాజీ వైస్ చైర్మన్ పులిగళ్ల మాధవరావు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, నాయకులు కాకటి భార్గవ్, పాయం కృష్ణప్రసాద్, ప్రసన్నకుమార్, కల్తీ పద్మ, మడుగు వెంకటలక్ష్మి , కమల్ కోరి, మున్నా, ఉల్లింగ సతీష్, గాలిపల్లి స్వరూప, గుడిపల్లి అజయ్, దండుగుల శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల మండల కమిటీ ఏర్పాటు



చర్ల, నవంబర్ 09(ప్రజా జ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం గుర్తింపు, గౌరవం కల్పించి వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర ముఖ్య సలహాదారు గోపగాని శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చర్ల మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో పటేల్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని పోరాటాలు సాగించారని వారి త్యాగాలు, పోరాటాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారికి తగిన గుర్తింపు, గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనేక మంది ఉద్యమకారులు నేటికీ ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు ఆర్థిక సహాయం, పెన్షన్, ఆరోగ్య భద్రత, ఇతర సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.నాటి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారు పోలీస్ స్టేషన్ రికార్డుల్లో నమోదైన వివరాలకు సంబంధించిన ఆధార పత్రాలను సేకరించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చర్ల మండల కమిటీ ప్రకటన

ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక చర్ల మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా కొట్టె నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ యాకూబ్, ప్రధాన కార్యదర్శిగా అలం సమ్మయ్య, కార్యదర్శిగా పఠాన్ మహబూబ్ ఖాన్, కోశాధికారిగా మచ్చు రాజును నియమించారు.కార్యవర్గ సభ్యులుగా ముత్యాల కిషోర్, కాక దుర్గయ్య, బోడిక సోమరాజు, కోటి నరేష్, సయ్యద్ మైనుద్దీన్, కొప్పుల సందీప్‌లను ఎంపిక చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా పాశికంటి పద్మ, ప్రధాన కార్యదర్శిగా బీదోజీయన వెంటనరసమ్మను నియమించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు భట్టు రాజేందర్ నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పొడియం నరేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (కల్చరల్) నల్లమోతు సురేష్, రాష్ట్ర ముఖ్య సలహాదారు గోపగాని శంకర్, భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు పటేల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- **వారి ఆశయాల సాధనే నిజమైన నివాళి**
- **కమ్యూనిస్టు విప్లవోద్యమ అమరవీరులకు విప్లవ జోహార్లు**
- **సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు కల్లూరి కిషోర్**



పాల్వంచ, నవంబర్ 9, ప్రజాజ్యోతి:కమ్యూనిస్టు విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధన కోసం పోరాటాలను కొనసాగించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు కల్లూరి కిషోర్ అన్నారు.నవంబర్ నెలలో అమరవీరులను,వారి త్యాగాలను,ఆశయాలను స్మరించుకుంటూ సభలు నిర్వహించాలని రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా పాల్వంచలోని పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ రావన్న, డీవీకేలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్లూరి కిషోర్ మాట్లాడుతూ.. జీవితం ఎంతో విలువైనదని, మరణం సహజమైనదని, కేవలం తన కోసం జీవించిన జీవితం సాధారణమైనదని, సమాజం కోసం, ఉన్నత లక్ష్యాల కోసం, తోటి మనుషుల కోసం జీవించిన వారే మహోన్నతులని పేర్కొన్నారు.దోపిడీ, అన్యాయాలను ప్రశ్నిస్తూ సమతా సుందరమైన సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం జీవితాలను అర్పించిన వారు మహానీయులని అన్నారు. భూమి, భుక్తి, పేదల రాజ్యం కోసం, దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భూస్వాముల పెత్తనాన్ని, అటవీ అధికారుల దౌర్జన్యాలను ఎదిరించి ఎంతోమంది అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు.బత్తుల వెంకటేశ్వరరావు, నీలం రామచంద్రయ్య, పోట్ల రామనరసయ్య, రాయల సుభాష్ చంద్రబోస్, డీవీ కృష్ణ, రాయల చంద్రశేఖర్, ఏనుగు అప్పయ్య, కాచనపల్లి అమరవీరులు తదితరులు ఈ ప్రాంత ప్రజా ఉద్యమాలకు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాల స్ఫూర్తితో ఈ ప్రాంతంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వ భూములు, వేలాది ఎకరాల పోడు భూములను సాధించుకున్న చరిత్ర ఉందన్నారు. పాల్వంచ డివిజన్ ప్రాంత ప్రజా ఉద్యమాలకు అమరవీరులు చేసిన కృషిని స్మరించుకుంటూ వారందరికీ విప్లవ జోహార్లు అర్పించారు.ప్రపంచవ్యాప్తంగా, దేశంలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో సమాజం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ సైన్స్, సాంకేతికత, సంపద పెరుగుదల కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయని విమర్శించారు. అసమానతలు, ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని, నిరుద్యోగం, అధిక ధరలు, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు.పాలక వర్గాలు పేదల పేరుతో ధనికులకు కొమ్ముకాస్తూ దేశ సంపదను, ప్రజా వనరులను దేశీయ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోని మౌలిక వనరులు, చమురు, ఖనిజాలు, విమానాశ్రయాలు, రైల్వేలు, ఇస్రో, ఎల్ఐసీ, బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని విమర్శించారు.మోడీ, అమిత్ షాల నేతృత్వంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదం, మూఢభక్తి, సనాతన ఆచారాల పేరుతో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తూ విద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. ఈడీ, ఐటీ, సీబీఐ, ఎన్ఐఏ వంటి ప్రభుత్వ సంస్థలతో పాటు ఎన్నికల కమిషన్, న్యాయ వ్యవస్థపై కూడా పాలకులు ప్రభావం చూపుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామిక హక్కులు, రాజ్యాంగ హక్కులను ప్రశ్నించే వారిని అణచివేస్తూ ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు.ఎస్ఐఆర్ పేరుతో 13 కోట్ల 40 లక్షల మంది ఓటర్లను తొలగించి వారి పౌర, ప్రజాస్వామిక హక్కులను హరించేందుకు కుట్ర జరుగుతోందని అన్నారు. ఓటు చోరీ, నోటు చోరీ, ఫలితాల చోరీ ద్వారా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసి ఫాసిస్టు పాలనను శాశ్వతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రేపిస్టులు, బ్యాంకు రుణాల ఎగవేతదారులు, పేపర్ లీకేజీ బ్రోకర్లు, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టే దొంగలు, అవినీతిపరులు బీజేపీకి పునాదులుగా మారారని ఆరోపించారు.దేశంలో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం యువత, ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ముఖ్యంగా కమ్యూనిస్టులు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజం సంక్షోభంలో ఉందని, దేశ ప్రజలకు రోజురోజుకూ భారంగా మారుతోందని అన్నారు. సమాజ మార్పు కోసం విప్లవం అవసరమని పేర్కొన్నారు.అమరవీరుల స్వప్నమైన సమసమాజం, నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కోసం ప్రతినబూనడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని, మారిన పరిస్థితులకు అనుగుణంగా కర్తవ్యాలను రూపొందించుకుని విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అమరవీరుల సోషలిస్టు స్వప్నాలకు వారసులుగా నిలబడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ పట్టణ కార్యదర్శి రాయబారపు వెంకటేశ్వర్లు, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్, వేల్పుల రమేష్, కుంజ భాస్కర్, ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు కె. పద్మ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉంజుపల్లి పాఠశాలలో ఆరోగ్య శిబిరం



చర్ల, నవంబర్ 9(ప్రజా జ్యోతి):చర్ల మండలంలోని ఉంజుపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా సోమవారం ఆరోగ్యశిబిరం నిర్వహించారు. చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వైద్యసిబ్బంది విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, వాటి లక్షణాలు, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యతను వివరిస్తూ, చేతులను సరైన పద్ధతిలో ఎలా శుభ్రం చేసుకోవాలో ప్రాక్టికల్‌గా నేర్పించారు.అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అనారోగ్య సమస్యలు గుర్తించిన వారికి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ హారిక, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఆదరణ కరువు.. ఒక్కటే దరఖాస్తు!



ములకలపల్లి, నవంబర్ 9 (ప్రజాజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువవుతోంది.మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కేవలం ఒకే ఒక్క దరఖాస్తు అందడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కొరవడిందా? లేక సమస్యలు పరిష్కారం కావడం లేదనే నమ్మకం సన్నగిల్లిందా? అనే చర్చ జరుగుతోంది.ఇప్పటికైనా అధికారులు ప్రజావాణిపై విస్తృత ప్రచారం కల్పించి ప్రజల నుంచి స్పందన వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గిరిజన సంస్కృతికి అద్దం పట్టిన జనజాతీయ గౌరవ దివస్

- **సాకివాగులో ఘనంగా 15 రోజుల వేడుకలు**
- **గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి**
- **సర్పంచులు మడకం విజయ, కోర్సా ఆదిలక్ష్మి**



ములకలపల్లి, నవంబర్ 09 (ప్రజాజ్యోతి): ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకొని రాచన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సాకివాగులో జనజాతీయ గౌరవ దివస్ 15రోజుల వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, మూక మామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ బిర్సా ముండా పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన డోలు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సర్పంచులు సైతం కళాకారులతో కలిసి నృత్యాలు చేసి సందడి చేశారు. గ్రామ పెద్దలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వగేల వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి బిట్ట వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ బత్తుల మధుచంద్‌కు ఘన సన్మానం

- **తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సోలో డాన్స్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ**



పాల్వంచ, నవంబర్ 9, ప్రజాజ్యోతి: పాల్వంచ 38వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్‌ను భద్రాది 24 క్రాఫ్ట్స్ యూనియన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సోలో డాన్స్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను కార్పొరేటర్ బత్తుల మధుచంద్ ఆవిష్కరించారు.యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా కార్పొరేటర్ మధుచంద్ అభినందించారు. కళాకారులను ప్రోత్సహిస్తూ యూనియన్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపకులు కడారి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు ఆలం శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కార్తిక్, కంచర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ మండల ప్రజావాణికి రెండు దరఖాస్తులు

- 19 శాఖల అధికారుల హాజరు
- సమస్యల పరిష్కారానికి ఎంపీడీవో సూచనలు



పాల్వంచ, నవంబర్ 9, ప్రజాజ్యోతి: పాల్వంచ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 19 శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి రెండు దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు, మండల పంచాయతీ అధికారికి సంబంధించి ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

అదనపు కట్నం వేధింపులు

- భర్త, అత్త, ఆడపడుచుపై వివాహిత ఫిర్యాదు
- రూ.3 లక్షలు తీసుకురావాలంటూ వేధింపులు
- ముగ్గురు పిల్లలతో ఇంటి నుంచి గెంటివేశారని ఆరోపణ

పాల్వంచ, నవంబర్ 9, ప్రజాజ్యోతి: అదనపు కట్నం కోసం భర్త, అత్త, ఆడపడుచు వేధింపులకు గురిచేస్తున్నారని గోపి శ్యామల అనే మహిళ పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనను శారీరకంగా, మానసికంగా వేధించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరింది.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఉల్వనూర్ గ్రామానికి చెందిన గోపి శ్యామలకు, లక్ష్మీదేవిపల్లి మండలం బంగారు చెలక గ్రామానికి చెందిన గోపి నవీన్‌తో 2021 మార్చి 23న వివాహం జరిగింది. వివాహ సమయంలో భర్త, అత్త, ఆడపడుచు డిమాండ్ మేరకు ఆమె తల్లిదండ్రులు రూ.5 లక్షల నగదు, మూడు తులాల బంగారం కట్నంగా ఇచ్చారని, అనంతరం ఇంటి సామాన్లు కూడా కొనిచ్చారని తెలిపింది.అయినప్పటికీ వివాహమైన కొద్ది రోజుల నుంచే ఆడపడుచు కట్నం పేరుతో వేధించేదని, భర్త మద్యం సేవించి వచ్చి తనను అనుమానిస్తూ కొట్టేవాడని ఫిర్యాదులో పేర్కొంది. అదనంగా మరో రూ.3 లక్షలు తీసుకురావాలని భర్త, అత్త, ఆడపడుచు ఒత్తిడి తెచ్చేవారని ఆరోపించింది. ఈ విషయంపై గతంలో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా, ఇకపై వేధించబోమని హామీ ఇచ్చినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదని తెలిపింది.తనకు ఇద్దరు కుమారులు నెల్సన్ (4), నోయల్ (3), కుమార్తె న్యాన్సీ (18 నెలలు) ఉన్నారని పేర్కొంది. 2026 అక్టోబర్ 30న అదనపు కట్నంతో పాటు ఆడపడుచు కట్నం తీసుకురావాలని, లేకుంటే ఇంట్లో ఉండకూడదని బెదిరించి తనను కొట్టి, తిట్టి ఇంటి నుంచి బయటకు పంపించారని శ్యామల ఫిర్యాదులో తెలిపింది.తనను వేధించిన భర్త గోపి నవీన్, అత్త గోపి లక్ష్మి, ఆడపడుచు దాక్షిణాగమణిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులను కోరింది.

ప్రజల ముంగిటకు తెలంగాణ రక్షణసేన

- గాంధీనగరంలో పర్యటించిన నియోజకవర్గ ఇన్‌చార్జి సోడెం వెంకట్



దమ్మపేట, నవంబర్ 9 (ప్రజాజ్యోతి): అశ్వారావుపేట నియోజకవర్గంలో తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జి సోడెం వెంకట్ ఆధ్వర్యంలో దమ్మపేట మండలం గాంధీనగరంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేనిఫెస్టోలోని భూలక్ష్మి, పంచజన్య పథకాల లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు. ప్రతి కుటుంబానికి మేనిఫెస్టో అంశాలను చేరవేసి, ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు సోడెం వెంకట్ తెలిపారు.

జర్నలిస్టులకు అండగా టీజేఎంయూ

- జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి
- టీజేఎంయూ భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు జి. రామలక్ష్మణ్



చర్ల, నవంబర్ 09(ప్రజా జ్యోతి): జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన కోసం జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి సంఘటిత పోరాటాలు చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ (టీజేఎంయూ) భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు జి.రామలక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం చర్ల మండలంలోని స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.జర్నలిస్టులపై నమోదవుతున్న అక్రమ కేసులను ఎదుర్కోవడంతో పాటు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్లు,ఇంటిస్థలాలు,జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో ఉచిత విద్య వంటి సంక్షేమ సదుపాయాల సాధనకు టీజేఎంయూ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందేలా కృషి చేస్తామని, అవసరమైతే రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని జర్నలిస్టులందరూ యూనియన్‌లో సభ్యత్వం తీసుకొని ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.ఈ సందర్భంగా స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సామల ప్రవీణ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికలు,హోదాలు,స్థాయిల పేరుతో జర్నలిస్టుల మధ్య కొందరు విభేదాలు సృష్టిస్తూ ఐక్యతను దెబ్బతీస్తున్నారని అన్నారు. ఈ విభేదాలను కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపార వర్గాలు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటూ ప్రజా సమస్యలపై నిజాయితీగా పోరాడే జర్నలిస్టులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సాధించుకోలేకపోతున్నామని తెలిపారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు అందరూ ఒకే వేదికపైకి వచ్చి సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు ఐ.ప్రభాకర్ నాయకత్వంపై నమ్మకంతో ఐదేళ్ల క్రితమే యూనియన్‌లో కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ సభ్యులంతా టీజేఎంయూలో చేరి ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. సారపాక, తాళ్లగొమ్మూరు గ్రామంలో నిర్వహించనున్న యూనియన్ రెండో మహాసభలో చర్ల మండల అధ్యక్ష పదవిని స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ సభ్యులకు కేటాయించి, మండల అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశం కల్పించాలని రామలక్ష్మణ్‌ను విజ్ఞప్తి చేశారు.చర్ల జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.దీనిపై స్పందించిన జి. రామలక్ష్మణ్ స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ సభ్యులకు యూనియన్ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే టీజేఎంయూ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో స్వేచ్ఛ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు టీ. రమణ, కోశాధికారి డీ. విష్ణు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా వి బి జి రామ్ జి కింద చెరువులు తవ్వకాలు చేపట్టాలి

- వి బి జి రామ్ జి కింద దీర్ఘ కాలపు ఉపయోగపడే పనులు చేపట్టాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశాలను ఆచరణ లో పెట్టాలి
- గడ్డి గుట్టలో చెరువు సాసైటీ ఏర్పాటు చేసి ఉపాధి కల్పన చేయాలి
- ఎంపీడీవో ను కలసి చర్చించిన యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్



లక్ష్మీదేవి పల్లి ,నవంబర్ 9, ప్రజా జ్యోతి: లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలో అన్ని పంచాయతీ పరిధిలో ఉపాధి హామీలో భాగంగా వి బిజి రామ్ జి కింద దీర్ఘకాలపు ఉపయోగపడే పనులు చేపట్టాలని లక్ష్మీదేవి పల్లి మండలం ఎంపీడీవో ని కలిసి చర్చించిన లక్ష్మీదేవి పల్లి యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ లావుడియా నరేష్ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ముందస్తు చర్యలో భాగంగా అన్ని మండలాల్లో ఉపాధి హామీలో భాగంగా దీర్ఘ కాలపు ఉపయోగపడే పనులు చెరువులు, కుంటలు, పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారని ,ఈ నేపథ్యంలో మండల ఎంపీడీవో గడ్డి గుట్ట పంచాయతీలో మిగులు ప్రభుత్వ భూమి ఉన్నందున ఆ భూమిని ఎమ్మార్వో ద్వారా సేకరించి ఉపాధి హామీ కింద చెరువు త్రవ్వకాలు చేపట్టి సొసైటీ ఏర్పాటు చేయాలని, ఈ సొసైటీ మత్స్య శాఖకు సంబంధించి గిరిజనులకు ఉపాధి అవకాశాలు దిశగా రూపొందించాలని పేర్కొన్నారు .అదేవిధంగా పంచాయతీ లో నిజమైన నిరుపేదలకు రెండో విడత ఇందిరమ్మ గృహాలు వచ్చే విధంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు జరపాలని, ఏలినివో ప్రభావం వలన నీటి కొరత లేకుండా ముందస్తు చర్యలో భాగంగా గిరి వికాస్ పథకం కింద బోర్లు శాంక్షన్ చేయాలని , రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అభివృద్ధి పదంలో వచ్చే విధంగా ప్రజా ప్రభుత్వం ఆశయాలకు కట్టుబడి ఉండాలని తెలియపరిచారు.

సీఎం పదవికే వన్నె తెచ్చిన రేవంత్ రెడ్డి

- పాల్వంచలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు
- రోగులకు పండ్ల పంపిణీ
- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



పాల్వంచ, నవంబర్ 9, ప్రజాజ్యోతి: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సీఎం పదవికే వన్నె తెచ్చారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం దీపావళి పర్వదినం సందర్భంగా పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.పాల్వంచ అయ్యప్పనగర్‌లోని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే గుర్తింపు పొందిన నాయకుడిగా పేరొందారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీల విమర్శలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ వాటికి దీటుగా సమాధానమిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహీపతి రామలింగం, కొండం వెంకన్నగౌడ్, సాదం రామకృష్ణారావు, నరిగె సుజాత, పైడిపల్లి మహేష్, వై. వెంకటేశ్వరరావు, చింతా నాగరాజు, డిష్ నాగేశ్వరరావు, వాసుమల్ల సుందర్ రావు, కొమురాజు విజయ్, దప్పు రాము, షేక్ షఫీ, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, పాకాలపాటి రోశయ్య చౌదరి, షేక్ దస్తగిరి, షేక్ బాషా, షేక్ మదార్, ఆటో మల్లికార్జున్, కటుకూరి శేఖర్, లోగాని రామకృష్ణ, పట్టా వీరకుమార్, ఇంజా దుర్గారావు (బాబి), బూసి శ్రీను, బండి నాగరాజు, కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం క్రాస్ రోడ్‌లో నాసిరకం సరుకుల దందా..?

- బ్రాండెడ్ పేరుతో డూప్లికేట్ వస్తువుల విక్రయాలపై ఆరోపణలు
- బిల్లులు, జీఎస్టీ లావాదేవీలపై విచారణ జరపాలి
- గిరిజన గ్రామాలే లక్ష్యంగా వ్యాపారమా.. పట్టించుకోని అధికారులు!



పినపాక,నవంబర్09 (ప్రజాజ్యోతి): బయ్యారం క్రాస్ రోడ్ కేంద్రంగా సాగుతున్న కొన్ని వ్యాపారాల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి ప్లైవుడ్, హార్డ్‌వేర్, ఫ్యాన్సీ వస్తువుల వరకు నాణ్యత లేని సరుకులు విక్రయిస్తున్నారంటూ స్థానిక వినియోగదారుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆకర్షణీయమైన షోరూంలు ఏర్పాటు చేసి, బ్రాండెడ్ పేర్లతో నాసిరకం వస్తువులు అంటగడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాల వినియోగదారులు లక్ష్యంగా వ్యాపారం సాగుతోందనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

బిల్లులు ఇవ్వడంలోనూ అనుమానాలు

కొన్నిదుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు పూర్తిస్థాయి జీఎస్టీ బిల్లులు ఇవ్వడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. తెల్ల కాగితాలపై ఎస్టిమేషన్ చీటీలు ఇచ్చి విక్రయాలు సాగిస్తున్నారా? సరుకుల కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. రాజస్థాన్ నుంచి వస్తున్న సరుకులకు సంబంధించి ఇన్వాయిస్‌లు, ఈ–వే బిల్లులు, జీఎస్టీ చెల్లింపుల వివరాలను తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్లైవుడ్ నాణ్యతపై వివాదం

ఇటీవల ప్లైవుడ్ కొనుగోలు చేసిన వినియోగదారుడికి కొద్ది రోజులకే వస్తువు విరిగిపోవడంతో వ్యాపారిని ప్రశ్నించినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే నాణ్యత, వారంటీ విషయంలో సరైన సమాధానం లభించకపోవడంతో వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. ఎలక్ట్రానిక్ వస్తువుల విషయంలోనూ నాణ్యత, తయారీ సంస్థ వివరాలు, వారంటీపై స్పష్టత ఉండాలని వినియోగదారులు కోరుతున్నారు.

అధికారులు తనిఖీలు చేస్తారా?

బయ్యారం క్రాస్ రోడ్‌లోని దుకాణాల్లో విక్రయిస్తున్న వస్తువుల నాణ్యత, ధరలు, ప్యాకేజింగ్, తయారీ వివరాలు, తూకాలు, బిల్లులపై సంబంధిత శాఖలు సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా జీఎస్టీ శాఖ, లీగల్ మెట్రాలజీ, వినియోగదారుల వ్యవహారాల శాఖ అధికారులు రంగంలోకి దిగి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నాసిరకం సరుకులు విక్రయించే వ్యాపారాలపై చర్యలు తీసుకోకపోతే వినియోగదారులు మరింత నష్టపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి బయ్యారం క్రాస్ రోడ్‌లోని వ్యాపార సంస్థలపై తనిఖీలు నిర్వహించి నిజానిజాలు నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- మర్కోడు ప్రధాన కూడలిలో కేక్ కట్.. కాంగ్రెస్ శ్రేణుల సందడి



ఆళ్ళపల్లి,నవంబర్ 9 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని మర్కోడు ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచులు,నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు,కార్యకర్తలు ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ,మిఠాయిలు పంచుకుంటూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ప్రధాన కూడలిలో పార్టీ శ్రేణుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజా సేవలో మరిన్ని సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,సర్పంచులు,పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో కూటమి విజయంపై దమ్మపేట టీడీపీ నాయకుల హర్షం



దమ్మపేట, నవంబర్ 9(ప్రజాజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కూటమి తరపున విజయం సాధించిన మేయర్లు,మున్సిపల్ చైర్మన్లు,జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు దమ్మపేట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కూటమికి అందించిన మద్దతును జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగించారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు విజయాన్ని అందించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దమ్మపేట మండల టీడీపీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.సోమవారం ఉదయం దమ్మపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూటమి అభ్యర్థులపై ఉంచిన విశ్వాసానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు.విజయం సాధించిన ప్రజాప్రతినిధులందరూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. గెలుపొందిన ప్రతి ఒక్కరికీ మరోసారి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ వలీపాషా, సొసైటీ వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప, తెలుగు రైతు అధ్యక్షుడు గడ్డిపాటి సత్యనారాయణ, నాయుడు వీరాస్వామి, బొల్లా మోహన్‌రావు, పారుపల్లి భద్రం, భోగి సత్యం, చిర్ర ధర్మారావు, నాయుడు సుబ్బారావు, పానుగంటి రామారావు, అల్లాడి అప్పారావు, ఓకే కుమారి, చక్రపు ప్రసాదు, బాబురావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ దెబ్బకు రైతుల విలవిల!

- పంట నష్టాలకు తక్షణ పరిహారం చెల్లించాలి
- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ..
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా





దమ్మపేట, నవంబర్ 9(ప్రజాజ్యోతి): మురసు తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం దమ్మపేటలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.. వరి పంటకు ఎకరాకు రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.లక్ష పరిహారం అందించాలని కోరారు. పంట నష్టాలపై గ్రామాల వారీగా సమగ్ర సర్వే చేపట్టాలని, రైతుల పంట రుణాలు మాఫీ చేసి వడ్డీలేని కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించి రోజుకు రూ.800 కూలీ చెల్లించాలని, రాబోయే సాగుకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలని కోరారు. ఏఐయూకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరి కిషోర్, తోడం దుర్గమ్మ, పండూరి వీరబాబు, తామా రాముడు, కుంజా కాంతారావు, తెల్లం నగేష్, బొగ్గం మల్లికార్జున్, వాగ్గేల ప్రసాద్, సున్నం జగన్, ఊకే మహేష్, సోయం లక్ష్మయ్య, పూజల సంజీవరావు, కిసరి వెంకటేష్, వాడే జోగారావు, సోయం సీతారాములు, కిసరి వెంకటేశ్వరరావు, కుంజా పాపారావు, జంగా లక్ష్మీనారాయణ, తగరం భీమరాజు పాల్గొన్నారు.

అమరుల ఆశయాల సాధనే నిజమైన నివాళి

- యువత అమరవీరుల స్ఫూర్తితో ముందుకు రావాలి
- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు పోతుగంటి లక్ష్మణ్ మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ



ములకలపల్లి, నవంబర్ 9(ప్రజజ్యోతి): సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం రాచన్నగూడెం పంచాయతీలో అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు.పద్దం లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో అమరవీరులకు నాయకులు, గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పేదలు, గిరిజనులు, రైతులు, కూలీల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను కొనసాగించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. పార్టీ 4 మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ మాట్లాడుతూ.. అమరవీరుల స్ఫూర్తితో యువత ముందుకు రావాలని, గ్రామీణ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సర్పంచులు మడకం విజయ, కోర్సా ఆదిలక్ష్మి , ఉపసర్పంచ్ వగ్గెల వెంకటేశ్, నాయకులు నకిరికంటి నాగేశ్వరరావు, బండారు నాగేంద్రబాబు, పీవైఎల్ నాయకుడు గడ్డం వెంకటేశ్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరువు మండలాలను ప్రకటించాలి!

కొత్తగూడెం, నవంబర్ 9 ప్రజా జ్యోతి : రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్న మండలాలను గుర్తించి తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలు లేక, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, పొట్టకొచ్చిన పంటలు నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి వరికి రూ.30 వేలు, పత్తి, మిర్చి పంటలకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. సోమవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు అండగా నిలవాలని అన్నారు. వ్యవసాయానికి విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, పంటలు నష్టపోయిన కౌలు రైతులకు కూడా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉపాధి కల్పించేలా ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టడంతో పాటు పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని ఉచితంగా అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఈ ధర్నాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడమే ధర్నా ప్రధాన ఉద్దేశమన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని సాబీర్ పాషా పిలుపునిచ్చారు.

పక్షవాతంతో బాధపడుతున్న హోంగార్డు సత్యనారాయణ

- వైద్య ఖర్చుల కొరకు "సమాచారం గ్రూప్" సభ్యులు ఆర్థిక చేయూత
- పట్టణ సీఐ సట్ల రాజు చేతుల మీదగా రూ. 30,200/- సాయం అందజేత



భద్రాచలం, నవంబర్ 9 (ప్రజాజ్యోతి): అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న హోంగార్డు సత్యనారాయణకు సమాచారం గ్రూప్ అండగా నిలిచింది. పట్టణ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ ఇటీవల పక్షవాతానికి గురయ్యారు. గత రెండు సంవత్సరాల క్రితం ఆయన భార్య రమాదేవి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించగా... ప్రస్తుతం ఆమె మంచానికే పరిమితమయ్యారు. దురదృష్టవశాత్తు 20 రోజుల క్రితం సత్యనారాయణ కూడా పక్షవాతానికి గురికావడంతో కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం కోలుకుంటున్నప్పటికీ ఫిజియోథెరపీ చేయించుకునేందుకు సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

›» వైద్య ఖర్చుల కొరకు సమాచారం గ్రూప్ సభ్యులు రూ. 30,200/- ఆర్థిక సాయం

ఈ విషయాన్ని సమాచారం గ్రూప్ అడ్మిన్ విజ్జగిరి రాజా కిరణ్ దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి గ్రూప్ సభ్యుల సహకారంతో ఒక్కరోజులోనే రూ. 30,200/- లు సమకూర్చారు. ఈ మొత్తాన్ని పట్టణ సీఐ సట్ల రాజు చేతుల మీదుగా సోమవారం సత్యనారాయణకు నివాసానికి వెళ్లి పరామర్శించి అందజేశారు.

›» ఈ సందర్భంగా సిఐ సట్ల రాజు మాట్లాడుతూ

2018 నుంచి సమాచారం అనే వాట్స్‌అప్ గ్రూప్ ద్వారా ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంతో పాటు సామాజిక బాధ్యతగా రోగులకు, విద్యార్థులకు, చిన్నారులకు ఆర్థిక వనరులను సమకూరుస్తూ సమాజంలో తమ వంతు పాత్ర పోషిస్తూ, ఆదర్శంగా నిలుస్తున్న సమాచారం గ్రూప్ సభ్యులను మరియు అడ్మిన్ రాజా కిరణ్ నీ అభినందించారు. అదేవిధంగా ఆపదలో ఉన్న కుటుంబానికి మానవతా దృక్పథంతో సహాయం అందించిన సమాచారం గ్రూప్ సభ్యులను పలువురు కొనియాడారు.

కార్తీక శోభతో వెలిగిన స్వయంభు సోమేశ్వరాలయం

- జ్వాలాతోరణం వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్ మూడు గణేష్



సుజాతనగర్, నవంబర్ 09, ప్రజా జ్యోతి : కార్తీకమాస పర్వదినాన్ని పురస్కరించుకుని సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలోని స్వయంభు శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం జ్వాలాతోరణం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడు గణేష్ ముఖ్య అతిథిగా హాజరై జ్వాలాతోరణాన్ని వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అర్చకులు సాయి మనోహర్ శర్మ, చొప్పకట్ల శ్రీనివాస్ శర్మ వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జ్వాలాతోరణం వెలుగులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా నెలరోజులపాటు స్వామివారికి నిత్య అభిషేకాలు, ప్రత్యేక పూజలు, నెలవారీ గోత్రనామాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కుమారి హసుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్యా దశ్రు, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జక్కుల రాములు, సీపీఐ నాయకులు దండు సురేష్, కుమారి కృష్ణతదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తుఫాను బాధితులకు భరోసా







- ముంపు సమస్యకు పరిష్కారం!
- నెమలిపేటలో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన
- పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట, నవంబర్ 9(ప్రజాజ్యోతి): తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు వరద ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నట్లు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. సోమవారం దమ్మపేట మండలంలోని లింగాలపల్లి, నెమలిపేట గ్రామాల్లో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల మురసు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న రహదారులు, చెరువులు, వంటకాలువలను పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని, అర్హులైన రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

›» రెండు రోజుల్లోనే బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు

దమ్మపేట పంచాయతీ పరిధిలోని నెమలిపేట గ్రామాన్ని ఏళ్లుగా వేధిస్తున్న ముంపు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు చేపట్టారు. రెండు రోజుల క్రితం గ్రామంలో పర్యటించిన ఆయన కాలువపై ఉన్న పాత బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో వరద నీరు సక్రమంగా ప్రవహించక గ్రామం ముంపునకు గురవుతున్న విషయాన్ని గుర్తించారు. పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, రెండు రోజుల్లోనే అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం నూతన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. భవిష్యత్తులో వరద నీరు గ్రామంలోకి చేరకుండా కాలువకు ఇరువైపులా పటిష్టమైన కాంక్రీట్ రక్షణ గోడల నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. త్వరలోనే ఆ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎంపీడీఓ సాబ్..
యువత గోడు వినిపిస్తోందా?

- ఆటస్థలం లేని అశ్వాపురం.. యువత భవిష్యత్తుతో చెలగాటం!
- ఉద్యోగాల కోసం పరుగులు తీయాలన్నా స్థలం కరువు.. అధికారులకు పట్టదా?
- ఎన్నికలప్పుడే యువత గుర్తొస్తారా? సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్‌ను కలుస్తాం!



అశ్వాపురం నవంబర్ 9,ప్రజాజ్యోతి: అశ్వాపురం మండలంలో యువతకు ఆటస్థలం లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారుతోందని మండల యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత తీవ్రంగా శ్రమిస్తుంటే, మరోవైపు పరుగు పందెం, శారీరక దృఢత్వ పరీక్షలకు సాధన చేసుకునేందుకు కనీసం ఆటస్థలం కూడా అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమని వాపోతున్నారు.ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోలీస్, ఆర్మీ తదితర నియామకాలకు సిద్ధమవుతున్న యువకులు ప్రతిరోజూ పరుగులు, వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. కానీ అశ్వాపురం మండలంలో ప్రత్యేకంగా ఆటస్థలం లేకపోవడంతో రహదారులపై, అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో సాధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల ప్రమాదాల భయం కూడా వెంటాడుతోంది.

›» అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలేనా? యువత భవిష్యత్తు పట్టదా?

మండల అభివృద్ధి గురించి మాట్లాడే అధికారులు, ప్రజాప్రతినిధులు యువతకు అవసరమైన ఆటస్థలం ఏర్పాటు విషయాన్ని ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. క్రీడా మైదానం ఏర్పాటు చేయడం కూడా అభివృద్ధిలో భాగమేనన్న విషయాన్ని గుర్తించాలని కోరుతున్నారు. ఎన్నో గ్రామాలకు కేంద్రంగా ఉన్న అశ్వాపురం మండలంలో యువత కోసం ఒక ఆటస్థలం ఏర్పాటు చేయలేకపోవడం బాధాకరమని పేర్కొంటున్నారు.

›» ఎన్నికలప్పుడే యువత గుర్తుకొస్తారా?

ఎన్నికలు వచ్చినప్పుడు యువత అవసరం గుర్తుకొస్తుంది..హామీలు ఇవ్వడానికి నాయకులు ముందుంటారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత యువత సమస్యలను పట్టించుకునే వారు కరువవుతున్నారని మండల యువత మండిపడుతున్నారు. యువత భవిష్యత్తును తీర్చిదిద్దే ఆటస్థలం ఏర్పాటు చేయాలన్న కనీస ఆలోచన అధికారులకు లేదా అని నిలదీస్తున్నారు.

›» ఇప్పటికైనా ఎంపీడీఓ స్పందించాలి!

అశ్వాపురం మండల యువత సమస్యపై ఎంపీడీఓ ప్రత్యేక దృష్టి సారించి, ఆటస్థలం ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను నేరుగా వివరిస్తామని యువత స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి యువత భవిష్యత్తుకు బాటలు వేస్తారా? లేక యువత ఆవేదనను గాలికి వదిలేస్తారా? అన్నది వేచి చూడాలి.